**కథ** **కె.రాజేశ్వరి**

# కల చేసిన మేలు

**కాలేజీ కేంపస్‌లోకి అతి స్పీడుగా వచ్చి ఆగిందో అందమైన టయోటా కారు. కుడిచేతి చూపుడు వేలితో కారు కీస్‌ని స్టయిల్‌గా తిప్పుతూ డోర్ తెరుచుకుని కిందకి దిగాడు కిరణ్.**

అతని కోసమే ఎదురుచూస్తున్నట్టు చెట్ల కింద నిల్చున్న అతని మిత్రబృందం ''ఏంర్రా.. రెండ్రోజుల నుంచి అడ్రసే లేదు. ఏమైపోయావు?'' అంటూ ఎదురెళ్లారు.

''మా బాబాయి కూతురికి ఎంగేజ్‌మెంట్ అయితే అనుకోకుండా అనకాపల్లి వెళ్లాల్లే. ఏమిటి విశేషాలు?'' ఫ్రెండ్స్ భుజాల మీద చేతులు వేస్తూ అన్నాడు కిరణ్.

''అక్కడ మీ బాబాయి కూతురి ఎంగేజ్‌మెంట్‌తోపాటు ఇక్కడ నీ కిన్నెరకి కూడా ఎంగేజ్‌మెంట్ అయింది తెలుసా?''

''ఏం కూశావ్‌రా'' ఆ మాటలన్న సురేష్ మీదికి ఆవేశంగా చెయ్యెత్తాడు.

ఎత్తిన ఆ చేతిని గబుక్కున పట్టుకుని ఆపి ''వాడు చెప్పింది నిజమేరా'' అన్నాడు వాసు.

''అయినా నువ్వంటే ఇష్టంలేదని ఆ పిల్ల ఓ పక్క చెబుతుంటే ఎందుకురా అలా వెంటబడతావు? వదిలేయరా..'' నచ్చచెప్పబోయాడు ప్రసాద్.

''నెవ్వర్... నన్ను కాదని అది వేరే వాళ్లని ఎలా చేసుకుంటుందో చూస్తాను.. అది నాకు దక్కేదాకా నేను నిద్రపోను'' ఆవేశంగా అంటూ అప్పుడే ఫ్రెండ్స్‌తో అటుగా వెళ్తున్న కిన్నెరని చూసి ''వన్ మినిట్'' అంటూ అటు వైపు నడిచాడు.

''ఏయ్... నిన్నే... ఆగు''

''.............''

''ఏయ్... నీకేనే చెప్తూంది.. ఆగు.. నీతో మాట్లాడాలి''

వినిపించుకోనట్టు వెళ్లిపోతున్న కిన్నెర ఒక్క క్షణం ఆగి అతని వైపు చూసింది.

''మర్యాద ఇచ్చిపుచ్చుకోవటం మంచిది'' సీరియస్‌గా అన్నది కిన్నెర.

''నీ చేత మర్యాదలు నేర్పించుకోవాల్సిన పని లేదు. ముందిది చెప్పు.. నీకు మేరేజ్ సెటిలైందా?''

చూపుడు వేలు చూపిస్తూ సీరియస్‌గా అడుగుతున్న కిరణ్‌ని చూసి ''అవును... '' అన్నది కిన్నెర స్థిరంగా.

''నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకుంటానని చెబుతుంటే నన్ను కాదని వేరెవడ్నో పెళ్లి చేసుకుంటావా? ఎంత ధైర్యం?''

''నేనూ ఎన్నోసార్లు చెప్పాను. నువ్వంటే నాకు ఇష్టం లేదని.. అయినా కూడా నా వెంట పడుతూ నీ ఇష్టం వచ్చినట్టు ఏవేవో ఊహించుకుంటే అది నా తప్పు కాదు''

''అదే.. అదే.. నేనంటే ఎందుకు ఇష్టం లేదు? నాకు ఆస్తి లేదా? అందం లేదా? చదువు లేదా? నేను చిటికేస్తే చాలు... పందలు, వేలల్లో అమ్మాయిలు వచ్చి నా ఒళ్లో వాలిపోతారు. అలాంటిది నేనంటే నీకెందుకు ఇష్టం లేదట''

కిరణ్ కళ్లల్లోకి ఓ క్షణం సూటిగా చూసి అడిగింది- ''నీకు ఏ సినిమా హీరోయిన్ అంటే ఇష్టం?''

''నేను నిన్ను అడిగిందేమిటి? నువ్వు చెప్పిందేమిటి? ఏం వేళాకోళంగా వుందా?''

''ముందు నేనడిగిన దానికి సమాధానం చెప్పు'' స్థిరంగా అన్నది.

''ఏంటే బోడి నీకు సమాధానం చెప్పేది'' అని రాష్‌గా అనాలనుకుని కిన్నెర పక్కకి వచ్చిన ఆమె ఫ్రెండ్స్‌ని, అప్పుడే అటుగా వస్తున్న మేడమ్‌ని చూసి కాస్త తగ్గాడు.

''త్రిష'' నెమ్మదిగా అన్నాడు.

''ఏం మిగతా హీరోయిన్లు కూడా అందంగానే వుంటారుగా. వాళ్లంటే నీకెందుకిష్టం లేదు?'' సూటిగా చూస్తూ అడిగింది.

''అది నా ఇష్టం. అడగటానికి నువ్వెవరు?''

''అదే మాట నేనూ అంటున్నాను. ఆస్తి, అంతస్తు, అందం ఉన్నాయని అందర్నీ ఇష్టపడలేము. నా పెళ్లి నాకు ఇష్టం వచ్చిన వ్యక్తితో అవుతుంది. అది అడగటానికి నువ్వెవరు? ఇంకెప్పుడూ ఇలా నా వెంటపడి విసిగించకు'' విసవిసా వెళ్లిపోయింది అక్కడి నుంచి.

''ఎంత పొగరు? ఏం చూసుకునే నీకింత అహంకారం? చూస్తానే... నన్ను కాదని వేరే వాడిని ఎలా చేసుకుంటావో అదీ చూస్తా...'' దెబ్బ తిన్న బెబ్బులిలా బుసలు కొడుతూ వెనుతిరిగాడు.

ఆవేశంగా వెనక్కి వచ్చిన కిరణ్‌ని చూసి ''ఏమంటుందిరా?'' అన్నారు.

''దానికి పొగరెక్కువైంది. నేనంటే ఇష్టం లేదని పాత పాటే పాడుతోంది. ఇంతకీ దాని పెళ్లి ఎప్పుడట?''

''అమెరికా సంబంధమట. ఆ అబ్బాయికి సెలవులు ఎక్కువగా లేవని తొందర్లోనే అంటే ఎగ్జామ్స్ అయిన వెంటనే పెట్టేసుకున్నారట''

''ఐసీ... ఎగ్జామ్స్ ఎప్పటితో అయిపోతాయి?''

''మొదలయ్యాయిగా... ఎప్పటితో అయిపోతాయో, పెళ్లి కరెక్టుగా ఎప్పుడో సాయంత్రాని కల్లా నేను కనుక్కుని చెబుతాలే. ఇప్పుడు క్లాసుకి టైమైంది. పదండి...'' అని వాసు అనటంతో అందరూ క్లాస్‌రూం వైపు దారితీశారు.

కిరణ్ లీడింగ్ పార్టీలో వున్న ఓ రాజకీయనాయకుడి ఏకైక ముద్దుల కొడుకు. ఐదేళ్లు కుస్తీపట్టి డిగ్రీ పూర్తిచేసి తండ్రికున్న డబ్బు, పలుకుబడితో ఎంబీయేలో సీటు కొనుక్కున్నాడు. తండ్రి అక్రమంగా సంపాదిస్తున్న కోట్ల ఆస్తితో ఫ్రెండ్స్‌ని వెంటేసుకుని తాగి తందనాలాడుతుంటాడు. అందమైన ఆడపిల్ల కనిపించిందంటే చాలు డబ్బాశ పెట్టో, బలవంతంగానో తన గెస్టు హౌస్‌కి రప్పించుకుని అనుభవించి కాని వదలడు. అతడు ఆడింది ఆట.. పాడింది పాట.

కిరణ్ యూనివర్శిటీలో చేరేసరికి కిన్నెర ఫైనల్ బిటెక్ చదువుతోంది. కాలేజీ బ్యూటీగా పిలవబడే కిన్నెరను చూడగానే ఎలాగైనా తన చుట్టూ తిప్పుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేశాడు. చదువే లోకంగా ఎంతో అణకువతో నిండు గోదారిలా ఉండే కిన్నెర ఏనాడు తనవైపు కన్నెత్తి కూడా చూడకపోయేసరికి విసిగిపోయి ఆమె వెంటబడి వేధించటం మొదలెట్టాడు. ఎంతగా వేధించినా అదురుబెదురు లేకుండా ఉండే కిన్నెరని చూస్తుంటే అప్పటి వరకు అనుభవించి వదిలేయాలనుకున్న కోరిక స్థానంలోనే ఆమె మీద ఇష్టం మొదలైంది. అది కాస్తా క్రమంగా పెరిగి చివరికి పెళ్లంటూ చేసుకుంటే కిన్నెరనే చేసుకుంటాననే దాకా ఎదిగింది. దాన్నే ప్రేమనుకుంటున్నాడు అతడు.

అందరు ఆడపిల్లల్లాగే సంసార జీవితం సంతోషంగా, ప్రశాంతంగా సాగిపోవాలని కోరుకునే కిన్నెర అన్ని అలవాట్లకి దాసుడై జులాయిగా




తిరిగే కిరణ్ అంటే సహజంగానే అసహ్యాన్ని పెంచుకుంది. అందుకనే ఎన్నోసార్లు కిరణ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చినా సున్నితంగా తన అయిష్టతను తెలియచేసి తిరస్కరించింది.

''రేయ్ కిరణ్! కిన్నెర ఎగ్జామ్స్ ఈ నెల పద కొండుకల్లా అయిపోతాయట. పదిహేను రాత్రి పెళ్లి. ఇరవై నాలుగున చెన్నయ్‌లో ఫ్లయిట్ ఎక్క డమట'' తను సేకరించిన విషయాన్ని సాయం కాలానికల్లా కిరణ్‌కి అందించాడు వాసు.

''పదిహేను లోపే దాని మెళ్లో మూడు ముళ్లు వేయాలి. లేదా దాన్ని మరొకరికి దక్క కుండానన్నా చేయాలి'' కోపంతో పళ్లు పటపట కొరికాడు కిరణ్.

''ఏంట్రా అలా మాట్లాడుతున్నావు? కొంప దీసి బలవంతాన పెళ్లి చేసుకుంటావా ఏమిటి?''

వాసు మాటలకి ''అవున్రా! కిన్నెర నాది. నాకే సొంతం కావాలి'' స్థిరంగా అన్నాడు.

''రేయ్ కిరణ్! ఎందుకొచ్చిన గొడవరా ఇదంతా.. వదిలేయ్‌రా.. అంతగా ఇష్టం లేదం టున్న పిల్లని చేసుకుని నువ్వు మాత్రం ఏం సుఖ పడతావ్‌రా? ఎప్పుడైనా మనం ప్రేమించిన వాళ్ల కంటే మనల్ని ప్రేమించిన వాళ్లని చేసుకుంటేనే జీవితం సుఖంగా వుంటుంది. చూడు... నువ్వంటే పడి చచ్చేవాళ్లు ఎంతోమంది వున్నారు. వాళ్లల్లో నీకు నచ్చిన అమ్మాయిని సెలక్టు చేసుకుని పెళ్లాడరా'' హితబోధ చేయ బోయాడు ప్రసాద్.

''నాకెవరూ నీతులు చెప్పక్కర్లేదు. కిన్నెర నా స్వంతం కావాల్సిందే. నాకు దక్కని పక్షంలో ఎవ రికీ దక్కకుండా చేస్తాను'' స్థిరంగా అన్నాడు.

''ఏంట్రా... ఏం చెయ్యాలనుకుంటు న్నావు? నీ ఆవేశం చూస్తుంటే మాకేదో భయంగా వుంది''

వాసు భయం చూసి ''చెప్పను... చేసి చూపి స్తాను'' అంటూ కారు స్టార్ట్ చేసుకుని వెళ్లిపో యాడు.

★ ★ ★

ఫ్రెండ్స్‌తో కలిసి ఎప్పటిలాగే బయటే డిన్నర్ చేసి రాత్రి పది గంటలకి ఇంటికి చేరాడు కిరణ్. బెడ్‌రూంలోకి వచ్చి తలుపు దగ్గరగా వేసి అప్పటివరకూ ఎవరికీ తెలియకుండా ప్యాంటు జేబులో దాచుకున్న చిన్న బాటిల్‌ని బయటకి తీశాడు. దాని వంక తీక్షణంగా చూస్తూ ''మూడొంతులు నీ అవసరం రాదనే అను కుంటా.. ఒక వేళ మరీ మొండికేస్తే మాత్రం నీకు పని చెప్పక తప్పదు...'' అనుకుంటూ దాన్ని భద్రంగా దాచిపెట్టాడు.

అది యాసిడ్ బాటిల్. కాలేజీలో లాబ్ అసి స్టెంట్‌కి డబ్బాశ చూపి రెండో కంటికి తెలియ కుండా తెచ్చి దాచుకున్నాడు.

కిన్నెరని భయపెట్టో బలవంతపెట్టో తనదానిగా చేసుకోవాలని అతని ప్లాన్. అది కాని తననుకొన్నట్టు సక్రమంగా జరిగిందా సరే... లేని పక్షంలో కిన్నెర మీద యాసిడ్ పోసి కురూపిలా మార్చి ఎవరికీ దక్క కుండా చేయాలని అతని ఆలోచన.

పెళ్లా? యాసిడ్ పోయాటమా? చూస్తాను. రెంటిలో ఏది సక్సెస్‌ఫుల్‌గా జరుగుతుందో.. ఆలోచనల్లోపడి బెడ్ మీద వాలిపోయాడు.

★ ★ ★

క్లాస్ రూంలో నుంచి బయటికి వస్తున్న కిన్నెరని చూసి గబగబా దగ్గరికి వచ్చాడు కిరణ్.

''మర్యాదగా నా వెంట రా. ఈరోజే మన పెళ్లి'' అంటూ బలవంతంగా చెయ్యి పట్టుకుని లాక్కెళ్తున్న కిరణ్ చేతిలో నుంచి తన చేతిని బలవంతాన లాక్కుని-

''యూ రాస్కెల్! ఇన్నాళ్లు నువ్వెం తగా వేధిస్తున్నా మౌనంగా భరించి మర్యా దగా నీకు సమాధానం చెప్పాను. సహనాని కైనా ఓ హద్దంటూ వుంటుంది. ఇక నిన్ను భరించటం నా వల్ల కాదు..'' అంటూ కాలికున్న చెప్పు తీసి కిరణ్ రెండు చెంపలు వాయించింది.

జీవితంలో మొట్టమొదటిసారిగా అలా చెంపదెబ్బ తినటం... అదీ ఒక ఆడపిల్ల ఎడంకాలి చెప్పుతో కాలేజీలో స్టూడెం ట్సందరూ చూస్తుండగా జరిగేసరికి అవ మానం భరించలేకపోయాడు.

''అందర్నీ కాదని నీ వెంటే పడుతున్నానా మరీ రెచ్చిపోతున్నావు. ఏం చూసుకునే నీకింత పొగరు? నీ అందం చూసుకునేగా? నన్నింతగా అవమానించిన నిన్ను వూరికే వదిలిపెట్టనే'' అంటూ జేబులోంచి యాసిడ్ బాటిల్‌ని బయ టికిలాగి చిటికెలో దాని మూత తీసి దాన్లోని యాసిడంతా కిన్నెర ముఖం మీద పడేలా విసి రాడు.

అంతే... దిక్కులు పిక్కటిల్లేలా కిన్నెర ఏడుపులు, స్టూడెంట్లు, కాలేజీ స్టాఫ్ మొత్తం కిన్నెర చుట్టూ మూగటం క్షణాల్లో జరిగిపో యింది.

ఎవరు ఫోన్ చేశారో కానీ వెంటనే పోలీ సులు వచ్చి కిరణ్‌ని అరెస్టు చేయటం, కిన్నె రని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి చేర్చటం జరి గిపోయింది.

★ ★ ★

కేసు కోర్టుకి వచ్చింది. ఒక బోనులో కిరణ్, మరో బోనులో చున్నీ తల మీదుగా కప్పుకుని ముఖం కనపడకుండా తలొంచు



కుని కిన్నెర ఉన్నారు.

''యువరానర్! ఒక అమ్మాయి నువ్వంటే నాకిష్టం లేదు అని ఎంతగా చెబుతున్నా విన కుండా వెంటపడి వేధించటమే కాక, ఆ అమ్మా యికి పెళ్లి కుదిరిందని తెలిసి తనకి దక్కకుండా

## ఇదో టైపు ప్రతీకారం

**ఆమధ్య రాఖీ సావంత్-మికాసింగ్ (దలేర్ మెహెందీ తమ్ముడు- ఈయన కూడా పాప్ సింగరే) తనని బలవంతంగా ముద్దుపెట్టుకున్నా డని రాఖీ కోర్టులో కేసు వేసింది కదా! సోనీ చానల్ రియాలిటీ షో 'బిగ్‌బాస్'లో రాఖీ పాల్గొన్న సంగతి కూడా అందరికీ తెలుసు. అలాగే చివరి వరకూ వుండి రాఖీ ప్రైజు కొట్టే స్తుందనిపించింది. కానీ ఆమెని ఆ ప్రోగ్రాం నుంచి బయటకి పంపించడంలో మికాసింగ్ పాత్ర చాలా వుందిట. తనని రచ్చకీడ్చిన రాఖీకి 'బిగ్‌బాస్' ద్వారా మంచి ఇమేజ్ రావడం నేను మాత్రం ఎందుకు సహిస్తాను. అందుకనే నా ఫ్రెండ్స్ సహకారంతో దాదాపు 55 వేల మేసె జ్‌లు పంపించి రాఖీని బయటకొచ్చేసేలా చేసాను. ఇప్పుడు నాకు తృప్తిగా వుంది అని ధైర్యంగా చెబుతున్నాడు మికాసింగ్.**

పోతుందన్న కోపంతో ఆమె ముఖం మీద యాసిడ్ పోసి ఆమె జీవితాన్ని నాశనం చేయటం సహించరాని నేరం. సభ్యస మాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన విషయం. ఇలాంటి కిరాతకుడికి ఒక్క క్షణంలో ప్రాణం పోయే ఉరి శిక్ష చాలదు యువరానర్. అంతకంటే పెద్ద శిక్ష ఏదైనా ఉంటే న్యాయశాస్త్రాన్ని తిరగరా సైనా సరే అలాంటి శిక్ష వేయాలి. అప్పుడే ఇలాంటి కామాంధులకి కొందరి కైనా బుద్ధి వస్తుంది''

తన తరఫు వాదిస్తున్న లాయర్ మాటలు వింటూ చిన్నగా అన్నది కిన్నెర ''మీరంతా ఒప్పుకుంటే నాదో చిన్న విన్నపం జడ్జిగారూ'' అని.

''నువ్వేం చెప్పదలచుకున్నా నిర్భ యంగా చెప్పమ్మా''

''చూడండి.. అతను కేవలం నా మీదున్న ప్రేమతో నేనెక్కడ తనకి దక్క కుండాపోతానో అనే కోపంతో నా ముఖం మీద యాసిడ్ పోసాడు. దానికి ప్రతీకా

రంగా మీరతనికి ఉరిశిక్ష విధిస్తే మా ఇద్దరిలో ఎవరికీ న్యాయం జరగదు. అందుకని... అందు కని...'' కాసేపు ఆగింది కిన్నెర.

''మీ అందరి సమక్షంలో మా ఇద్దరికీ పెళ్లి చేయండి''కోర్టులో ఉన్నవాళ్లంతా కిన్నెర మాటలకి ఓ క్షణం బిత్తరపోయింది.

జడ్జిగారు తేరుకుని ''అదేంటమ్మా! పండంటి నీ జీవితాన్ని నాశనం చేసిన ఈ నర రూప రాక్షసుడిని పెళ్లిచేసుకుంటావా? స్పృహలో వుండే మాట్లాడుతున్నావా?'' సీరియస్‌గా అడిగారు.

''అవునండి. అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నన్నీ స్థితిలో చూసిన వాళ్లెవరూ పెళ్లాడడానికి ముందుకు రారు. నా రూపాన్ని చూసి భయపడతారు. అసహ్యించుకుంటారు. అందుకనే నా ఈ స్థితికి కారకుడైన అతన్నే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అలాగైతే అతనికి శిక్ష పడదు. నాకు పెళ్లవుతుంది. ఏమంటారు?''

''అవునమ్మా! చిన్నదానివైనా మంచి నిర్ణయమే తీసుకున్నావు''

''జడ్జిగారూ! నాదొక చిన్న షరతు''

''ఏమిటమ్మా అది?''

''పెళ్లయ్యాక నాకే కీడు తలపెట్టకుండా ప్రేమగా చూసుకోవాలి. అందరి భర్తల్లాగే నన్ను కూడా సినిమాలకి, షికార్లకి, ఫంక్షన్లకి తీసుకెళ్లాలి. అదీ ఈ రూపంతోనే. డబ్బుంది కదాని ప్లాస్టిక్ సర్జరీలు చేయించి నన్ను అందంగా తయారుచేయాలని ప్రయత్నిస్తే మాత్రం నేను ఒప్పుకోను. ఇంతకు ముందు నన్నెంతగా ప్రేమించాను అనేవాడో ఇప్పుడు కూడా అదే ప్రేమతో చూసుకోవాలి.''

''అదేంటమ్మా! ఎవరైనా అందంగా కనపడాలని కోరుకుంటారు కానీ నువ్వేంటీ ఇలా కాలిన మచ్చలతో వికారంగా ఉండిపోవాలని కోరుకుంటున్నావు? ఎటూ ఆ అబ్బాయినే చేసుకోవాలని నిర్ణయించుకున్నావు కదా. అలాంటప్పుడు అందంగా తయారైతే తప్పేంటమ్మా?'' కుతూహలంగా అడిగారు జడ్జిగారు.

''అలాగైతే డబ్బున్న ప్రతి ఒక్కడూ అవతలివాళ్ల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా తను కోరుకున్న అమ్మాయిల మీద ఇలానే యాసిడ్ పోసి, తర్వాత ఏదో ఉద్ధరిస్తున్నట్టు పెళ్లిళ్లు చేసుకుని తర్వాత ప్లాస్టిక్ సర్జరీలతో అందంగా మార్చుకోగలరు. అలా కాకుండా ఇలానే నలుగురిలో తిరుగుతుంటే నన్ను చూసిన ప్రతి ఒక్కరూ జరిగింది కథలు కథలుగా చెప్పుకుంటారు. పైగా... నన్నిలా చూశాక ఏ మగాడూ తొందరపడి ఇలాంటి దారుణం చేయటానికి సాహసించడు. అంతేకాక నేనిలాగే తన కళ్లముందు తిరుగుతుంటే నన్ను చూసిన ప్రతి క్షణం తను చేసిన తప్పేంటో కిరణ్‌కి గుర్తొస్తూ వుంటుంది. జీవితాంతం నన్నీ రూపంలో చూస్తూ నాతో కాపురం చేయటం కంటే పెద్ద శిక్ష నా దృష్టిలో ఇంకొకటి లేదు''

''శభాష్! చిన్నదానివైనా చాలా బాగా చెప్పావమ్మా. ఇప్పుడే ఇక్కడే ఈ క్షణంలో మీ ఇద్దరి పెళ్లి జరిపిస్తాను.

విన్నావా కిరణ్! ఇది కోర్టు నీకు విధిస్తున్న శిక్ష. నీకిష్టమైనా లేకపోయినా ఆ అమ్మాయిని చేసుకోక తప్పదు. ఆ అమ్మాయికి ఏ కష్టమూ కలిగించకుండా ప్రేమగా చూసుకోవాలి. ఇది ఆర్డర్...'' అని నిమిషాల్లో మంగళసూత్రం, రెండు పూలదండలు తెప్పించారు.

జడ్జిగారి ఆజ్ఞ ప్రకారం ఇద్దరు బోనుల్లోంచి ఇవతలకి వచ్చారు.

కిరణ్ చేతికి మంగళ సూత్రాలిచ్చి కట్టమన్నారు. ఒకడుగు ముందుకేసి కిన్నెర మెళ్లో మూడు ముళ్లు వేద్దామని తలెత్తి చూసిన కిరణ్ అదే క్షణంలో కిన్నెర తలమీదున్న చున్నీ తీసేయడంతో ఆమె ముఖం చూసి కెవ్వుమన్నాడు.

ముఖమంతా కాలిపోయి నల్లగా ముడతలు పడి వికారంగా వుంది. ఎడమ వైపు కన్ను స్థానంలో చిన్న లొట్ట. ఇంగ్లీషు సినిమాలో డ్రాకులాని గుర్తుచేస్తూ భయంకరంగా వున్న కిన్నెర అవతారం చూసి-

''నో...నో.. నాకీ పెళ్లొద్దు.. నాకు ఉరిశిక్ష వేయండి. నన్ను వెంటనే ఉరి తీయండి. నాకీ పెళ్లొద్దు.. నాకీ పెళ్లొద్దు'' అంటూ పిచ్చి పట్టినవాడిలా బిగ్గరగా కేకలు వేయసాగాడు.

★ ★ ★

''ఒరేయ్! ఒరేయ్ కిరణ్! ఏమిట్రా అలా అరుస్తున్నావు? ఏమైందిరా నీకు?''

కిరణ్ బెడ్రూంలోంచి పెద్ద పెద్దగా కేకలు వినిపించటంతో కంగారుగా వచ్చి కిరణ్‌ని తట్టి లేపింది అతని తల్లి.

''నాకీ పెళ్లొద్దు.. నాకీ పెళ్లొద్దు'' రెండు చేతుల్తో తల్లిని నెట్టేస్తూ అలానే అరవసాగాడు.

''ఒరేయ్ నేన్రా అమ్మని.. లే.. లేచి కళ్లు తెరిచి చూడు..'' గట్టిగా కుదుపుతూ లేపేసరికి కళ్లు తెరిచి బిత్తరపోయి చూశాడు.

గుండెలు దడదడలాడుతుంటే అయోమయంగా గదంతా ఒకసారి కలయచూశాడు. ఎదురుగా కంగారుగా తన మొహంలోకి చూస్తున్న తల్లిని చూడగానే 'హమ్మయ్యా! ఇదంతా కలా?' అనుకుంటూ దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు.

''ఏం నాన్నా! పెళ్లొద్దు పెళ్లొద్దు.. అంటూ అలా అరిచావు?'' చెమటతో తడిసి ముద్దయిన కొడుకు మొహాన్ని పైట కొంగుతో తుడుస్తూ లాలనగా అడిగింది.

''ఏం లేదమ్మా! ఏదో పీడకల. చాలా భయంకరమైన కల. పిశాచి రూపంలో ఉన్న ఓ ఆడపిల్ల పెళ్లిచేసుకోమని నా వెంట పడింది. మైగాడ్... ఆ రూపం తలుచుకుంటేనే ఒళ్లంతా భయంతో గుగుర్పొడుస్తుంది''

''దేన్నో చూసి భయపడి వుంటావు. ఆంజనేయ స్వామి దండకం చదువుకుని పడుకో. రేపు స్వామీజీ దగ్గరికి తీసుకెళ్లి తాయెత్తు కట్టిస్తాను. ఇదుగో.. బాబా విభూది పెడుతున్నాను. ఇంకేం భయం లేదు. కళ్లు మూసుకుని పడుకో'' అంటూ విభూది నుదుటిన పెట్టి వెళ్లిపోయింది.

'మైగాడ్! ఎంత భయంకరమైన కల..? కలే ఇంత భయంకరంగా వుంటే ఇక జీవితంలో నిజంగా జరిగితే? అమ్మో! ఆమె మొహం గుర్తొస్తేనే భయంతో గుండాగిపోయేలా వుంది. అయినా నేనంటే ఇష్టంలేని దానికోసం నా జీవితాన్ని ఎందుకు నాశనం చేసుకోవాలి? నేను తొందరపడి నా ప్లాన్ అమలు చేయకముందే ఈ కల రావటం చాలా మంచిదైంది. ఈ కలే గనక రాకపోయి వుంటే రేపు ఈ కలే నిజమయ్యేది.. కాస్తలో ఎంత ప్రమాదం తప్పింది...నేనంటే ఇష్టంలేనిదాన్ని చేసుకుని పండంటి నా జీవితాన్ని చేతులారా నేనెందుకు నాశనం చేసుకోవాలి? ఆ ప్రసాద్‌గాడు చెప్పినట్టు నన్నిష్టపడ్డ పిల్లనే చేసుకుని హేపీగా వుంటేసరి'

ఆ ఆలోచన రావడంతోనే మనసంతా ఎంతో ప్రశాంతంగా ఉన్నట్టనిపించింది. గబగబా లేచి తనెంతో జాగ్రత్తగా దాచిపెట్టిన యాసిడ్ బాటిల్‌ని తీసి డ్రయినేజిలో పడేశాడు.

